రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## తాండూరులో విజృంభిస్తున్న విషజ్వరాలు

### -డెంగీతో పదేళ్ల బాలిక మృతి

**తాండూరు, ఆక్టోబరు 3, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో విష జ్వరాలు విజృభిస్తున్నాయి. డెంగీతో పదేళ్ల బాలిక మృతి చెందింది. మంగళవారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన అందరిని కలిచి వేసింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కుక్కింద గ్రామానికి చెందిన పురోహితుడు మల్లికార్జున స్వామి జీవనోపాధి కోసం తాండూరుకు వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంలోని కోడంగల్ రోడ్డు మార్గంలోని కాలనీలో నివాసముంటున్నాడు. మల్లికార్జున స్వామి కూతురు భవాని(10) స్థానిక గౌతమి మాడల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. ఇటీవల భవానికితీవ్ర జ్వరం రావడంతో కుటుంబసభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. అక్కడ చికిత్స నిర్వహించిన వైద్యులు భవాని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబసభ్యులు భవానిని హైదరాబాద్ తీసుకువెళ్తుండగా చేవెళ్ల సమీపంలో మృతి చెందింది. కూతురు మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

## తాండూరు బిఎస్పీ అభ్యర్థిగా చంద్రశేఖర్

**తాండూరు, ఆక్టోబరు 3, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా చంద్రశేఖర్ ముదిరాజ్‌ను ప్రకటించారు. మంగళవారం బిఎస్పీ పార్టీ అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేశారు. బిఎస్పీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ ఇంచార్జ్, రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ ఆద్వర్యంలో 20మందితో కూడిన జాబితాను విడుదల చేశారు. ఈ మేరకు తాండూరు బిఎస్పీ అభ్యర్థిగా చంద్రశేఖర్ ముదిరాజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన తనకు తాండూరు టిక్కెట్ తొలిజాబితాలో ప్రకటించడంపై పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పార్టీ అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలుపుతున్న చంద్రశేఖర్ ముదిరాజ్

# దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శం

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు
- రూ.22 కోట్లతో కొత్తూరు - లింగంధన పీడబ్ల్యుసీ బీటీరోడ్డు ప్రారంభోత్సవం
- సంగెం గ్రామంలో రూ.2కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు ప్రారంభించిన మంత్రి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

**షాద్‌నగర్, అక్టోంబర్ 3, (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలంలోని సంగెం,, అల్వాల గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి రూ.22 కోట్లతో నిర్మించిన కొత్తూరు - లింగంధన పీడబ్ల్యుసీ బీటీ రోడ్డు, సంగెం గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన అంతర్గతర రహదారులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతోనే నేడు ప్రతి పల్లె అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత పల్లెల రూపురేఖలే మారిపోయాయని పల్లె ప్రకృతి వనాలు, చెరువుల మరమ్మతులతో పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు పూర్తి ఆర్థిక స్వేచ్ఛను కల్పించారని, వారు ఆర్థికంగా ఎదగడానికి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అదేవిధంగా గర్భవతి నుంచి ప్రసవం వరకు అంబులెన్స్ ద్వార తీసుకెళ్లి ఆ తర్వాత కేసీఆర్ కిట్ ద్వార సురక్షితంగా పండంటి బిడ్డలతో ఇచ్చి ఇంటికి క్షేమంగా చేర్పిస్తున్నారని అన్నారు. గతంలో వృద్దులకు 200 రూపాయల ఫించన్ వస్తే కుటుంబ సభ్యులు పెద్దగా పట్టించుకోలేదని నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చే ఫించన్ ద్వారా కుటుంబసభ్యుల్లో వృద్దులకు గౌరవం లభిస్తుందని ఆయన అన్నారు. వేలాది కోట్ల రూపాయలతో ప్రతి పల్లెకు రోడ్లు మంజూరు అవుతున్నాయని ఆయన కొనియాడారు.

**ప్రసూన్ రెడ్డి మరణించిన చీరస్మరణీయుడు...**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు కేశంపేట మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం ప్రముఖ కాంట్రాక్టర్ ఎన్నం గోపాల్‌రెడ్డి కుమారుడు కీర్తిశేషులు ప్రసూన్‌రెడ్డి జయంతి స్మారక కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నం గోపాల్‌రెడ్డి కుమారుడు ప్రసూన్‌రెడ్డి మరణించి ఎన్నో ఏళ్ల అవుతున్నా అతన్ని స్మరించుకుంటూ చేపడుతున్న సేవ కార్యక్రమాలకు మైమరిచి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎన్నం గోపాల్‌రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్‌లతో కలిసి గోపాల్‌రెడ్డి పేద ప్రజలకు అందిస్తున్న వస్త్రాలను మంత్రి అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రవీందర్‌యాదవ్, కేశంపేట మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్‌రావు, గ్రామ సర్పంచి రేణుక, ఎన్నం మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎల్లంపేట్‌లో ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి

### -తీవ్రగాయాలకు గురైన బాలురకు చికిత్సలు

**మేడ్చల్, అక్టోబరు 3, ప్రభాతవార్త**

ఎల్లంపేట్ గ్రామంలో జరిగిన కుక్కలదాడిలో ఇద్దరు బాలురు తీవ్రంగా గాయాలకు గురయ్యారు. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన మసని సత్యనారాయణ కుమారుడు మసాని రుత్విక్ (3) కుక్కలు చేసిన దాడిలో తలకు తీవ్రగాయాలు అయినట్లు తెలిపారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అదే విధంగ ఎల్లంపేట్ గ్రామానికి చెందిన కౌశిక్ (4) బాలున్ని కూడ కుక్కలు దాడి చేయటంతో తీవ్రగాయాలు అయ్యాయి. ఈ బాలుడు ఇంటి బయట ఆడుకుంటుండగ కుక్కలు దాడి చేయటంతో గాయాలకు గురైనట్లు తెలిపారు. స్థానిక ఆర్ఎంపి డాక్టర్ వద్ద చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. అయితో ఒకరిని సోమవారం సాయంత్రం దాడి చేయగ మరొకరికి మంగళవారం సాయంత్రం కుక్కలు దాడి చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై గత మూడు నెలల క్రితం కుక్కల విషయంపై గ్రామపంచాయతీలో సర్పంచుకు, ఉపసర్పంచుకు, కార్యదర్శికి ఫిర్యాదుల చేయటం జరిగిందని, కుక్కలను అరికట్టటంలో గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యం చేస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఎల్లంపేట్‌లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, గత మూడు నెలల్లో ఇప్పటి వరకు ఐదుమంది పిల్లలపై కుక్కలు దాడులు చేశాయని ఇకనైనా కుక్కల సమస్యను పరిష్కరించాలని గ్రామ యువకులు కోరారు.



కుక్కలదాడిలో గాయపడిన చిన్నారుల దృశ్యం

## దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాల అమలు

### -కొడంగల్ మండలంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే



రుద్రారంలో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

**కొడంగల్ రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్తః** మండల పరిధిలోని రుద్రారం, నాగారం, పాటిమీదిపల్లి, అన్నారం గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం మండల పరిధిలోని రుద్రారం, పాటిమీదిపల్లి, నాగారం, అన్నారం గ్రామాల్లో రూ.7 కోట్ల 60 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రుద్రారంలో రూ.3 కోట్ల 50 లక్షలతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.20 లక్షలతో చర్చీ నిర్మాణానికి, ముస్లిం స్మశాన వాటిక ప్రహరి నిర్మాణానికి రూ.5 లక్షలు, మైనారిటీ కమ్యూనిటి హాలు కోసం రూ.15 లక్షలతో శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా రూ.2 కోట్ల 70 లక్షలతో పాటిమీదిపల్లి నుంచి రుద్రారం వరకు బీటీ రోడ్డు, రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేశా రు. రూ.60 లక్షలతో నాగారం నుంచి రుద్రారం వరకు బీటీ రోడ్డు, అన్నా రంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొడంగల్ నియోజకవర్గంలోని తండాలు, గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సౌకర్యం, తండాల్లో రోడ్ల నిర్మాణాలు, తాగునీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. రైతులకు రైతు బీమా, రైతు బంధు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు తాండూర్ మండల కేంద్రానికి చేరే విధంగా జుంటుపల్లి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, టి.అనిత, బాలమణి, నర్సిములు, తాండూర్ ఆర్డీవో శ్రీనివాసరావు, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో పాండు, కౌన్సిలర్ మధుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ మున్సిపల్‌లో రూ.2.17 కోట్లతో అభివృద్ధి పనులు

### -17 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీకి మంత్రి శంకుస్థాపన



బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో రూ.2.17 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పనాశాఖ చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. 17 వార్డుల్లో అవసరమైన చోట్ల సిమెంట్‌రోడ్లు, వరదనీటి పైపులు, భూగర్భడ్రైనేజీ, మంచినీటి నీటిపైపులైన్లు పనులకు మంత్రి మల్లారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ ఎండి.సాబేర్‌అలీ, కౌన్సిలర్లతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించి కొబ్బరికాయలు కొట్టారు. 1వ వార్డు కొండాపూర్ రైల్వేకాలనీలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 2వవార్డు ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయ పాఠశా ల వద్ద రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 3వ వార్డు ఎదులాబాద్‌రోడ్డు శ్రీచంద్ర స్కూల్ వెనుక రూ.10 లక్షలతో సిసిరోడ్డు, 4వ వార్డు మైసమ్మగుట్టకాలనీలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 5వ వార్డు కెఎల్ఆర్‌నగర్‌లో రూ.9 లక్షలతో హెచ్‌డిపిఈ నీటి పైపులైను, 6వవార్డు బ్రూక్‌బాండ్‌కాలనీలో రూ.10 లక్షల తో వరదనీటి డ్రైనేజీ నిర్మాణం, 7వ వార్డు గాంధీనగర్‌లో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 8వ వార్డు కొండాపూర్ మెయిన్‌రోడ్డులో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 9వ వార్డు ఇడబ్ల్యుఎస్‌కాలనీలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 10వ వార్డు జగదాంబ థియేటర్ వద్ద రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 11వ వార్డు డిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద రూ.10 లక్షలతో వరదనీటి డ్రైనేజీ నిర్మాణం, 13వ వార్డులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రూ.10లక్షలతో సిసి రోడ్డు, 14వ వార్డులో మున్సిపల్ కార్యాలయ ఎదురుగా రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 15వ వార్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద రూ.8 లక్షల తో సిసి రోడ్డు, 16వ వార్డులోని బాలాజీనగర్ రైల్వేగేటు వద్ద రూ.10 లక్షల తో సిసి రోడ్డు, 17వ వార్డులోని బాలాజీనగర్‌లో రూ.10 లక్షలతో సిసి రోడ్డు, 18వ వార్డులోని గీతామందిర్ ఎదురుగా కరీంగూడరోడ్డులో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కొండా పూర్ రోడ్డు రాజ్‌మార్ట్ నుంచి మాధవరెడ్డి వంతెన వరకు రూ.25 లక్షలతో, ఎదులాబాద్ రోడ్డు పశువైద్య శాల సమీపంలో రూ.25 లక్షలతో విద్యుత్ ఏబీ కేబుల్ (3వైర్) ఏర్పాటు చేసేందుకు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు.

## మహేశ్వరం మండలంలో ఉన్నోడికేనా దళిత బంధు?

- -పారదర్శకత లేదని సర్వత్ర విమర్శలు
- -ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా కొంతమంది బిఆర్ఎస్ లీడర్లు
- -నామా మాత్రంగానే అధికారులు
- -మంత్రి జోక్యం చేసుకొని పేదలకు న్యాయం చేయాలంటున్నా ప్రజలు

**మహేశ్వరం అక్టోబర్ 3 ప్రభాతవార్త :** దళిత బంధు అభ్యర్థుల ఎంపికల్లో బిఆర్ఎస్ నాయకులు కొంతమంది సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నా తీరు పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.దళిత బంధు అభ్యర్థుల ఎంపికల్లో ప్రభుత్వ అధికారుల కేవలం నామమాత్రులుగా కొనసాగుతుండడంతో బిఆర్ఎస్ నాయకులే కీలక రోల్ పోషిస్తున్నారు. రాష్ట్ర విద్యశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గంలో దళిత బంధు అభ్యర్థుల ఎంపికల్లో ఇప్పటి వరకు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగానే చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహేశ్వరం నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో దళిత బంధు ఎంపికలో ప్రభుత్వ అధికారులు బిఆర్ఎస్ నాయకులు సర్పంచ్‌లు ఎంపిక చేసిన వారి పేర్లనే ఫైనల్ చేస్తు సంబంధిత అధికారులకు పంపుతున్నారు. దీంతో దారిద్ర రేఖకు దిగువనున్నా పేద దళిత ప్రజలకు తీవ్రని అన్యాయం జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి. గతంలో మహేశ్వరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దళిత బంధు అభ్యర్థులను ఎంపిక చేసిన సమయంలోనే పలువురు బిఆర్ఎస్ లీడర్లు, సర్పంచ్‌లపై పలు ఆరోపణలు వ్యక్తమైన విషయం అందరికి తెలిసిందే. స్థానికంగా బిజెపి, కాంగ్రేస్ పార్టీలకు చెందిన నాయకులు ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు దళిత బంధు ఎంపికల్లో పారదర్శకత పాటించాలని వారు మండల పరిషత్ అధికారుల దగ్గర నిరసనలు ఆందోళనలు కూడా చేశారు. కొంతమంది సర్పంచ్‌లు తమకు అనుకూలంగా వ్యవహరించే వారికి అధిక ప్రాధాన్యత నిచ్చారని ముఖ్యంగా తమ బంధవులకు పెద్ద పీట వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.గత వారం రోజుల నుంచి తిరిగి మహేశ్వరం మండలంలో దళిత బంధు అభ్యర్థుల ఎంపికలు చేస్తున్నట్లు స్థానిక బిఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు దళిత వాడల్లో చేసున్న హాల్‌చల్ అంతింతాకాదు కొంతమంది పేర్లు రెండు మూడు మాసాల ముందే పేర్లు వ్రాసిన ఇప్పుడు తీరా చూసే సమయానికి అనేక మంది పేద ప్రజల పేర్లు తొలగించి తమకు అనుకూలంగా వ్యవహరించే వారికి ప్రాధాన్యత నిస్తున్నారనే విమర్శలతో గ్రామాల్లో ఒక్క సారిగా హడావిడిగా మారింది. ఈ విషయంలో స్థానికంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధుల మధ్య ఐక్యత లేక పోవడతో ఇలాంటి పరిస్థితి దాపురించిందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.మహేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో దళిత బంధువు అభ్యర్థలకు భూములు ఖరీదైన భవనాలు ఉన్న వారికి కూడా దళిత బంధు ఇస్తున్నారని ఇటీవల కాంగ్రేస్ పార్టీ నాయకులు విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి ఆరోపణలు చేశారు. ఇకనైనా స్థానిక శాసన సభ్యురాలు మంత్రి సబితాఇంద్రారెడ్డి దళిత బంధు అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత వహించాలని ప్రతి గ్రామానికి చేందిన లీస్టు పరిశీలిస్తే కొంతమందికైనా న్యాయం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతుంది. తక్షణమే మండల స్థాయి అధికారులు కూడా దళిత బంధు అభ్యర్థుల ఎంపికలో తగిన జాగ్రతలు చేపట్టాలని పలుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

### -జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి

**మహేశ్వరం, అక్టోబర్ 3ప్రభాతవార్త :** జిల్లాలో ఆర్టీసి బస్సులు సమయపాలన పాటించి ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా తీసుకువచ్చే విధంగా చూడాలని జిల్లా చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతనలో స్థాయి సంఘ సమావేశం నిర్వహించి గ్రామీణ అభివృద్ధి,వైద్య ప్రణాళిక పనులపై సమీక్ష చర్చించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ...కల్తీ మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని లైసన్స్‌లు మంజూరు చేశారని రవాణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిట్నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు.మండలంలో జరిగే జనరల్ బాడీ మీటింగ్‌లకు అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లాస్థాయి అధికారులకు సూచించారు.విద్యుత్ శాఖ అదికారులు బాగా పనిచేశారని ప్రశంసించారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా సబ్సిడి పథకాలు ఉపయోగించుకోవాలని యువతను కోరారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణి ప్రక్రియ పూర్తి అయిందని తెలియజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారని, ప్రభుత్వ పాశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తుందన్నారు. దసరా కానుకగా ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకం అందబోతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య గణనీ యంగా పెరిగిందని కార్పోరేట్ స్థాయిలో పేద వారికి వైద్యం అందిస్తుం దన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు వెంకట్‌రామ్‌రెడ్డి, దశరథ్ నాయక్, కో ఆప్షన్ సభ్యులు అలి అక్బర్‌ఖాన్, సీఈఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రంగారావు,జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 'మేడ్చల్'లో కాంగ్రెస్ విజయ తథ్యం

- -ఉమ్మడి రాష్ట పిసిసి మాజీ ఉపాధ్యక్షులు ఉద్దెమర్రి నర్సింహ్మారెడ్డి
- -కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపు కోసం కలిసి పనిచేస్తాం
- -మంత్రి మల్లారెడ్డి ఓటమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకుల పయనం
- -కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ప్రమాణం
- -పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి



తూంకుంటలో జరిగిన మేడ్చల్ ఎ.బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి రాష్ట్ర పిసిసి మాజీ ఉపాధ్యక్షులు ఉద్దెమర్రి నర్సింహ్మారెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర జంగయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, పి.శ్రీనివాస్‌రెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు

**శామీర్‌పేట, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ఈ సారి ఎమ్మెల్యే ఎన్నికల్లో మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్ టికెట్ ఎవరికి వచ్చినా కలిసి సమన్వయంతో సమిష్టిగా ఉండి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కంకణబద్దులుగా ఉండి పనిచేస్తామని ఉమ్మడి రాష్ట్ర పిసిసి మాజీ ఉపాధ్యక్షులు ఉద్దెమర్రి నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సారి మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి ఓటమి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులం కంకణం కట్టుకుని కలిసి పనిచేస్తామని కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరికి టికెట్ వచ్చినా గెలుపే ధ్యేయంగ పని చేస్తామని పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రమాణం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరుసూత్రాలను సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకవెళతామని, బిఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక తీరును ప్రజలకు వివరిస్తామని పలువురు నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం మేడ్చల్ నియోజకవర్గ ఎ బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి పంక్షన్‌హాల్‌లో మేడ్చల్ నియోజకవర్గ ఎ.బ్లాక్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనిలో ఆయనతో పాటు టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర జంగయ్యయాదవ్ (వజ్రేశ్‌యాదవ్),సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి ఎఐసిసి కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ ఆశీస్సులు అందుకున్న నక్క ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.శ్రీనివాస్‌రెడ్డి, పలువురు జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ పాల్గొన్న ఉమ్మడి రాష్ట్ర పిసిసి మాజీ ఉపాధ్యక్షులు ఉద్దెమర్రి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం తథ్యమని, తెలంగాణ రాష్ట్రంను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లో ఈ సారి మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఎవరికి వచ్చినా కలిసి పనిచేస్తామన్నారు. నక్క ప్రభాకర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరటాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర జంగయ్యయాదవ్ (వజ్రేశ్‌యాదవ్) మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి ఆగడాలు, భూకబ్జాలు, విద్య, వైద్య రంగాలలో దోపిడి పెరిగిందని సంపాదనే లక్ష్యంగ పనిచేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గానికి ప్రభుత్వ ఇంటర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ మంజూరు చేయించలేక పోయారని ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి మల్లారెడ్డి డబ్బులతో రాజకీయం చేస్తున్నారని, నాలుగున్నర ఏళ్ల నుంచి లేనిది స్వంత నిధులతో సిసి రోడ్లు, అభివృద్ధి పనులు చేపడుతున్నారని అంత అవసరం ఏమి వచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కుటుంబ అవినీతి పాలన సాగుతుందని, మేడ్చల్‌లో అవినీతి, భూకబ్జాలు,డబ్బులతో రాజ్యమేలుతున్నట్లు ప్రజలు ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మంత్రి మల్లారెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ టికెట్ ఎవరికి వచ్చినా కలిసి పనిచేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనకు మాతృనిలయమని,తన రాజకీయం కాంగ్రెస్ పార్టీ నుంచే మొదలు అయిందని అన్నారు. మేడ్చల్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇచ్చినా మనస్ఫూర్తిగ గెలుపు కోసం కార్యకర్తగ పనిచేస్తానని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో నీచ, దుర్మార్గ పాలన రాజ్యమేలుతుందని, భూకబ్జాలు, అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. మేడ్చల్ నుంచి మంత్రి మల్లారెడ్డిని ఓడించటమే ప్రధాన లక్ష్యంగ పనిచేస్తామని, అందరి లక్ష్యం కూడ అదేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తుందని, ప్రతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కాంగ్రెస్‌ను మేడ్చల్‌లో ఎమ్మెల్యేగా గెలిపించటానికి కలిసి పనిచేద్దామని తాను అందరికి అందుబాటులో ఉంటానని, త్వరలో మేడ్చల్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు నక్క ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. ఇక రెండు నెలల వరకు ఎన్నికల పూర్తి వరకు ప్రతి రోజు నిత్యం కాంగ్రెస్ పార్టీ నాయకులుగ ప్రజల్లో ఉంటానని, నాయకులకు,కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ ఎ.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్‌లో కాంగ్రెస్ విజయం కోసం పార్టీ కార్యక్రమాలను అందరితో చర్చించి నిర్వహిస్తామని, కాంగ్రెస్ ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామని జి.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎ.బ్లాక్ అధ్యక్షునిగా నియమించిన టిపిసిసి అధ్యక్షులు,ఎంపి రేవంత్‌రెడ్డికి,సహకరించిన నాయకులకు ఆయన దన్యవాదాలు తెలిపారు. దీనిలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఎ.బ్లాక్ అధ్యక్షులుగ నియమితులైన జి.వేణుగోపాల్‌రెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గ బిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్‌గౌడ్, మండలాల, మున్సిపాల్టీల కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, బి.నర్సింలుయాదవ్, శ్రీనివాస్ యాదవ్, రమణారెడ్డి, శ్రీకాంత్,మరి కొందరు అధ్యక్షులు, వైస్ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచు సురేందర్‌ముదిరాజ్, కౌన్సిలర్ ఎస్.మదుసూదన్‌రెడ్డి,మండల కోఆప్షన్ ఎండి ముజీబ్, నాయకులు బాల్‌రెడ్డి, యు.వెంకటేశ,రాజయ్య, జిల్లా,పలు మండలాల, మున్సిపాల్టీల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన

**-రూ.4కోట్ల80లక్షలతో నిర్మాణ పనులకు శ్రీకారం**



గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ 6వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి మల్లారెడ్డి,పాల్గొన్న మున్సివల్ ఛైర్మన్, తదితరులు

**మేడ్చల్, అక్టోబరు 3, ప్రభాతవార్త**

గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 6వ వార్డులో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపనలు చేశారు. మంగళవారం మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీలోని 6వ వార్డులో సుమారు రూ.4కోట్ల 80లక్షల రూపాయలతో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టటానికి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ చైర్పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, నాయకులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



ఎదులాబాద్‌లో మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్‌పార్టీ నాయకులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలకు మల్లారెడ్డి సేవా ట్రస్టు ద్వారా ఆర్థికసాయ ం అందించారు. గ్రామానికి చెందిన గుమ్మడి మైసయ్య, పుచ్చకాయల ఇస్తారి అనారోగ్యంతో చనిపోగా బీఆర్ఎస్‌పార్టీ నాయకులు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు మల్లారెడ్డి సేవా ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5,000ల చొప్పున కేటాయించగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుల కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి ఐదు వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు అల్లం శంకర్, ప్రధానకార్యదర్శి కొత్తన్‌పోన్ చిరంజీవి, మాజీ అధ్యక్షులు మెంగ బాలక్రిష్ణ, నాయకులు భర్తకు గణేశ్, కుకునూరి రాజశేఖర్, తోట రాంచందర్,కూరం మల్లేశ్,పూస సురేందర్, ట్రస్ట్ ప్రతినిధి సురేశ్ పాల్గొన్నారు.

**ఘణాపూర్ గ్రామంలో...**

ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఇద్దరి కుటుంబానికి మల్లారెడ్డి సేవా ట్రస్టు ద్వారా 5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఘణాపూర్‌లో వేముల మల్లయ్యగౌడ్, వడ్ల ప్రభావతిలు అనారోగ్యంతో చనిపోయారు. స్థానిక బీఆర్ఎస్‌పార్టీ నాయకులు ఇద్దరు మృతిచెందిన విషయాన్ని మంత్రి మల్లారెడ్డికి తెలియజేయడంతో ఆయన మల్లారెడ్డి సేవా ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం పంపించారు. బీఆర్ఎస్ నాయకులు మృతుల కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి ఐదు వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. ఘణాపూర్ మాజీ ఉపసర్పంచ్ బోనకూర్తి అర్జున్, మండల బీఆర్ఎస్ సంయుక్త కార్యదర్శి వేముల రాజుగౌడ్, నాయకులు వేముల సాయిగౌడ్, నిఖిల్‌గౌడ్, ట్రస్టు ప్రతినిధి సురేశ్‌లు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు చేసిన యాచారం యువకులు



రోడ్డు మరమ్మత్తులు చేపడుతున్న యువకులు

**యాచారం, అక్టోబర్ 3 ప్రభాతవార్త**

యాచారం - సాగర్ రహదారిపై యాచారం మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మంగళవారం రోడ్డు మరమ్మత్తులు చేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గ్రామల్లోని రహదారులన్నీ మరమ్మత్తులకు నోచుకోకుండా ఉన్నాయని ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడం భాదాకరమంటున్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపడున్నప్పటికీ ప్రయాణీకులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో, రోడ్ల మరమ్మత్తులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఇకనూనా సంబంధిత అధికారులు రోడ్ల మరమ్మత్తులు చేసి ప్రయాణీకులకు, వాహనదారులకు సౌకర్యాలు కల్పించాలని యువకులు కోరారు.

## గురుకుల పాఠశాలలో విజయోత్సవ సంబరాలు



గురుకుల పాఠశాలలో విజయోత్స వ సంబరాల దృశ్యం

**యాచారం, అక్టోబర్ 3 ప్రభాతవార్త**

ఆసియా క్రీడల్లో భాగంగా హెప్టథ్లాన్‌లో గురుకుల విద్యార్థిని నందిని అగసర పాల్గొని కాంస్య పతకం సాధించిన సందర్భంగా మంగళవారం యాచారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య అధ్యక్షతన సిబ్బంది, విద్యార్థులు విజయోత్స వ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేక్ కట్ చేసి విజేత నందిని అగుసరకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ స ందర్భంగా ప్రిన్సిపాల్ యాదయ్య, ఉపాధ్యాయులు మాట్లాడుతూ అవకాశం కల్పిస్తే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి గురుకుల విద్యార్థులు సిద్దంగా ఉన్నారని,విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ముందుండాలని ఆకాంక్షించారు.

## విద్యుత్తు షాక్‌తో ఎద్దు మృతి

**పూడూరు. అక్టోబర్ 3, ప్రభాతవార్త :** విద్యుత్తు షాకకు గురై ఓఎద్దు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పూడూరు మండలంలో చోటుచేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని రేంగడి మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎండి షరీఫ్ అనేరైతు మంగళవారం తన పొలానికి ఎడ్లబండితో వెళ్లాడు.పొలంవద్ద ఎడ్లు మేస్తుండగా పక్కనేఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు ప్రమాదావషత్తు ఓఎద్దు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని ప్రభుత్వం బాది తుడు శరీఫ్‌ను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



పూడూరు మండలం రేగడి మామిడిపల్లిలో విద్యుత్తు షాకకుగురై మృతిచెందిన ఎద్దు

# అణగదొక్కాలని ప్రయత్నిస్తే ఉవ్వెత్తున లేస్తాం

**ప్రజల అండదండలు మాకే ఉన్నాయి**

**భయంతోనే 5 అంచెల పోలీస్ వ్యవస్థతో అణచివేత**

**గెలిచేది మైనంపల్లియే**

**-కాంగ్రెస్ నాయకులు జీవన్‌రావు, గంగా నరేందర్**



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మెదక్ రూరల్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**

అణగదొక్కాలని ప్రయత్నం చేస్తే ఉవ్వెత్తున్నత లేస్తామని, సోమవారం మైనంపల్లి హనుమంతరావు, ఎంఎస్ఎస్‌వో అధినేత రోహిత్‌ల మెదక్, ఏడుపాయలకు వచ్చే ప్రయత్నాన్ని ఐదంచల పోలీస్ వ్యవస్థతో తెరాసనాయకులు భగ్నం చేయించారని, ఇలాగే పోలీస్ వ్యవస్థను వాడుతూ అణగదొక్కాలని ప్రయత్నంచేస్తే చూస్తూ ఊరుకోబమని తెరాస నాయకులు దేవేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రావు, గంగా నరేందర్‌లు హెచ్చరించారు. మంగళవారం మెదక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెల 28వ తేదీన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే సమక్షంలో మల్కాజ్‌గిరి మైనంపల్లి వహన్మంతరావు, ఎంఎస్ఎస్‌వో అధినేత మైనంపల్లి రోహిత్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్టోబర్ 2న హైదరాబాద్ ఏయిర్ పోర్టు నుండి సరాసరిగా ఏడుపాయల దుర్గాభవాని, మెదక్ చర్చి, నవాబుపేట దర్గాలను సందర్శించే కార్యక్రమానికి ఢిల్లీ నుంచి వచ్చే మైనంపల్లి హనుమంతరావు, రోహిత్‌లకు స్వాగతం పలకడానికి నియోజకవర్గం నుండి వందల సంఖ్యలో వాహనాల్లో వేలాదిగా కార్యకర్తలు,అభిమానులు బయలుదేరారు. మార్గమధ్యంలో తూప్రాన్, నర్సాపూర్ టోల్‌గేట్‌ల వద్ద ఎక్కడికక్కడే ఐదంచల పోలీసు భద్రత మధ్య మైనంపల్లి అభిమానులను పోలీసులు అడ్డుకోవడం, ఏయిర్ పోర్టు వద్దకు వెళ్లిన కార్యకర్తలపై కక్షపూరితంగా స్వల్పంగా లాఠీఛార్జి తరువాత క్రమంలో ఓఆర్ఆర్ పైన మైనంపల్లి అనుచరుల వాహనాలను ఎక్కడికక్కడే అడ్డుకోవడం, రాత్రి 10 గంటల సమయంలో వాహనాలను వెళ్లనీయకపోవడంతో సోమవారం ఏడుపాయల పర్యటన రద్దయిందని, అయినప్పటికీ బుధవారం ఉదయం 11 గంటలకు ఏడుపాయలతో పాటు మెదక్ చర్చి, నవాబుపేట దర్గాలను మైనంపల్లి హనుమంతరావు, రోహిత్ సందర్శించనున్నారని, దీన్ని అడ్డుకోవడానికి పోలీసు వ్యవస్థను వాడుకొని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఆమె భర్త దేవేందర్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, అయినప్పటికీ తాము సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మెదక్ నియోజకవర్గంలో ఒక ఓటు ఇద్దరు ఎమ్మెల్యేల పాలన నడుస్తుందని, అధికారులను ముప్పతిప్పలు పడెతున్నారని, ప్రతి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఏ హోదాతో దేవేందర్‌రెడ్డి సమీక్షల్లో పాల్గొంటున్నారని, ఈ విషయంపై కలెక్టర్‌ను సంప్రదించనున్నట్లు తెలిపారు. పోలీస్ వ్యవస్థ మొత్తం నిర్వీర్యం అయిందని, దేవేందర్‌రెడ్డి కనుసన్నల్లో నడుస్తుందని, ఎస్పీ తగిన చర్యలు తీసుకోకపోతే పై అధికారులకు ఈ విషయాన్ని చేరవేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు వారు ఇరవై సంవత్సరాల నుండి నియోజకవర్గంలో పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారని, ఇప్పుడు మైనంపల్లి ఆధ్వర్యంలో చేరిన కార్యకర్తలందరూ ఇంతకు ముందున్న కార్యకర్తల, నాయకుల నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంతకు ముందున్న కాంగ్రెస్ నేతలతో సమన్వయంతో పని చేస్తూ ముందుకెళ్తామని, వారితో మాకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. అంతిమ లక్ష్యంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఆమె భర్త పెత్తనాన్ని అణచివేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం అన్నారు. నేటి కార్యక్రమానికి కార్యకర్తలందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో నాయకులు మైనంపల్లి రంగారావు, పడాల సిద్దిరాములు, మాజీ కౌన్సిలర్ మున్నా, సత్యనారాయణ, పోతరాజు మనోజ్, గడీల సుధాకర్, నాగరాజు, నిజాంపేట, రామాయంపేట నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు,రేపు సిపిఐ ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్షలు



శామీర్‌పేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్,పాల్గొన్న నాయకుల దృశ్యం

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి) అక్టోబరు 3, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఈ నెల 4,5తేదీలలో జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద, మున్సిపల్ కార్యాలయాల వద్ద సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రిలే నిరహారదీక్షలు నిర్వహిస్తున్నట్లు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శామీర్‌పేటలో సిపిఐ నాయకుల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. వీటిని పరిష్కరించటానికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకరావటానికి పార్టీ పిలుపు మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రజలు భూసమస్యలు, ఇళ్లస్థలాలు పరిష్కారం కాలేదని, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, ఇళ్లపట్టాలు పేదలకు అందించటంలో,కలెక్టరేట్‌లో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం జరగటంలో తీవ్ర జాప్యం జరుగుతుందని అన్నారు. దళితబంధు, బిసి బంధు, పలు సంక్షేమ పథకాలు కూడ అర్హులకు అందటం లేదని, ప్రజాసమస్యలు పరిష్కరించటంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం అయిందని దీనిని నిరసిస్తూ ఈ నెల 4,5 తేదీలలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద, మున్సిపల్ కార్యాలయాల ముందు సిపిఐ ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ రిలే దీక్షలలో పార్టీ నాయకులు అందరు పాల్గొనాలని సాయిలుగౌడ్ సూచించారు. ఈ సమావేశంలో పలువురు సిపిఐ నాయకులు, రైతు నాయకులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రకటించిన 5శాతం ఐఆర్‌పై ఉపాధ్యాయుల నిరసనలు



.శామీర్‌పేట మండలంలోని పాఠశాల వద్ద నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసనలు జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, అక్టోబరు 3, ప్రభాతవార్త**

శామీర్‌పేట మండలంలోని వివిధ పాఠశాలల్లో టిఎస్ యుటిఎఫ్ శామీర్‌పేట మండల శాఖ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు నల్ల బ్యార్జీలు ధరించి నిరసనలు తెలియజేశారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని వివిధ పాఠశాలలను టిఎస్‌యుటిఎఫ్ శామీర్‌పేట మండల అధ్యక్షులు తిరిమలేశ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. దీనిలో జిల్లా అధ్యక్షులు జయసింహరెడ్డి, మండల అధ్యక్షులు తిరుమలేశ్, ప్రధాన కార్యదర్శి కుమార్, మండల కోశాధికారి తిరుమలప్రసాద్, కార్యదర్శి రవిలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగ ఉపాధ్యాయుల చేత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 5శాతం ఐఆర్ అనేది సమంజసం కాదని, దాన్ని పునసమీక్షించాలని నల్ల బ్యార్జీలతో ఉపాధ్యాయులు నిరసనలు తెలియజేసి ప్రభుత్వం స్పందించాలని వారు సూచించారు. ఉపాధ్యాయ బదిలీలు పధోన్నతులు కోర్టులో ఉన్న అడ్డంకులను తొలగించటానికి, చొరవ తీసుకోవాలని వారు కోరారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టిఎస్‌యుటిఎఫ్ అండగ ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు తిరుమలేశ్, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి : ఏడీ రజని

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని జిల్లా మత్స్యశాఖ ఏడీ రజని తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలో వివిధ గ్రామాలకు చెందిన మత్స్య కార్మికులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులు అభివృద్ధి చెందడం కోసం చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. మత్స్య సంపద వృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మండల వ్యాప్తంగా 21.50లక్షల చేప పిల్లలను అందించామన్నారు. పెంచిన చేపలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు రవాణా సదుపాయం కోసం 70 శాతం సబ్సిడితో ద్విచక్రవాహనాలను ఇప్పటికే మత్స్యకారులకు ప్రభుత్వం అందిజేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిధర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, వివిధ గ్రామాల మత్స్యకార్మికులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గోన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : సర్పంచ్

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జంగరాయి గ్రామంలోని కానుగ చెరువులో మంగళవారం సర్పంచి జ్యోతి 72వేల చేపపిల్లలను విడుదల చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులకు ఎలాంటి చేయూతనివ్వలేదని, సిఎం కేసీఆర్ వారి అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రవీందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీపతి, ప్రభాకర్, మత్స్యకార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన షేక్ షాబుద్దీన్ దర్గా ఉత్సవాలు

**-దర్గాను దర్శించుకున్న మాజీ మంత్రి, చైర్మన్**

**జహీరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మండలంలోని శేఖాపూర్ గ్రామంలోని షేక్ షాబుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిసాయి. రెండు రోజుల పాటు సాగిన ఉర్సు ఉత్సవాలను ఆయా ప్రాంతాల ప్రజలు చేరుకుని దర్గానుదర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ఆవరణలో నిర్వహించిన ఖవాలీ పోటీలు ఆకట్టుకున్నాయి. ఆయా ప్రాంతాల ఉంచి భక్తులు గంధంను ఊరేగింపుగా దర్గాకు చేరుకుని దర్గాకు సమర్పించారు దర్గాను మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్‌రావు, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ నరోత్తంలు వేరు వేరుగా దర్శించుకుని దర్గాకు దట్టీలు కప్పి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు దర్గాకు చేరుకున్న ప్రముఖులను ఉర్సు ఉత్స వ కమిటి బాధ్యులు ఘనంగా సన్మానించారు.

## ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు భేల్ భవన్స్ విద్యార్థులు

**రామచంద్రాపురం, అక్టోబరు 3, ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టుకు రామచంద్రాపురంలోని భేల్ టౌన్షిప్‌లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి జట్టు ఎంపిలో పబ్లిక్ స్కూల్‌కు చెందిన బాలికల అండర్ 17 విభాగంలో గగన, బాలుర అండర్ 14 విభాగంలో శ్రీకేష్‌రెడ్డిలు ఎంపికైనట్లు పాఠశాల బాధ్యులు తెలిపారు. 200 మంది విద్యార్థులు ఎంపికలో పాల్గొనగా గగన, శ్రీకేష్‌రెడ్డిలు ఎంపికవడం ఆనందంగా ఉందని పాఠశాల బాధ్యులు, విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును పునరుద్ధరించాలి

**కంది, అక్టోబరు 3, ప్రభాతవార్త:**

దేశ వ్యాప్తంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల కార్పొ రేషన్‌న వ్యతిరేకిస్తూ 7డిఫెన్స్ యులు కాకుండా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును పునరుద్ధదించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్లు ఏఐడీఈఎఫ్, బిపిఎంఎస్, సిడిఆర్‌ఏలు పిలుపునిచ్చాయి. మంగళవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ఫ్యాక్టరీ గేటువద్ద నిరసన వ్యక్తంచేశారు. నిరసన కార్యక్రమంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తంచేశారు. నిరసన కార్యక్రమంలో జేసిఎం వన్ సభ్యులు అజయ్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లోని ఓఎఫ్‌సియుఈయు ఓఎఫ్ఎంఎస్, ఐఎన్‌డి డబ్ల్యూ, ఎఫ్‌ఓఎఫ్ ఆర్‌ఈయు, ఏఐఏఎస్జీవోఎస్‌లు నిరసనలో పాల్గొన్నారు.

## 20 శాతం ఐఆర్‌ను ప్రకటించాలి

**న్యాల్‌కల్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను అవమానపర్చేలా 5 శాతం ఐఆర్‌ను ప్రకటించడం సరికాదని ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు. మండలంలోని చాల్కి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు ప్రభుత్వం 5 శాతం ఐఆర్‌ను ప్రకటించడాన్ని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2018 పిఆర్‌సిలో సైతం పిఆర్‌సిని 36 నెలలు ఆలస్యం చేసి 3 నెలల పిఆర్‌సి బకాయిలను 18 నెలలు ఇస్తామని చెప్పి వాటిని సైతం 3 నెలలే ఇచ్చి ఉపాధ్యాయులు నష్టపోయేలా చేసిందని విచారం వ్యక్తం చేశారు. పిఆర్‌సిని అధికంగా ఇస్తామని పదే పదే చెప్పిన ప్రభుత్వ కంటి మీద తుడుపు చర్యగా 5 శాతం ఐఆర్ ఇవ్వడం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యంతర భృతిని 20 శాతానికి పెంచుతూ ఐఆర్ జిఒను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 3 పెండింగ్ డిఏలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిపిఎఫ్ పెండింగ్ బిల్లులు, టిఎస్‌జిఎల్ఐ పెండింగ్ అమౌంట్లు, బకాయి పడ్డ పిఆర్‌సి అరియర్లు, డిఏ అరియర్లు ఇవ్వాలని పాఠశాల ఉపాధ్యాయులు ఆకుల మీన, విశాలా, శైలు, మణికుమార్, బాల్‌రెడ్డి, గంగామోహన్, యాదయ్య, సురేఖలు అన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**కంది, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మండలంలోని చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐఆర్ జిఒను వ్యతిరేకిస్తూ మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం సోమశేఖర్ మాట్లాడుతూ 2018 పిఆర్‌సిలో సైతం పిఆర్‌సిని 36 నెలలు ఆలస్యం చేసి 3 నెలల పిఆర్‌సి బకాయిలను 18 నెలలు ఇస్తామని చెప్పి వాటిని సైతం 3 నెలలే ఇచ్చి ఉపాధ్యాయులు నష్టపోయేలా చేసిందని విచారం వ్యక్తం చేశారు. పిఆర్‌సిని అధికంగా ఇస్తామని పదే పదే చెప్పిన ప్రభుత్వ కంటి మీద తుడుపు చర్యగా 5 శాతం ఐఆర్ ఇవ్వడం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యంతర భృతిని 15 శాతానికి పెంచుతూ ఐఆర్ జిఒను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 3 పెండింగ్ డిఏలు వవెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిపిఎఫ్ పెండింగ్ బిల్లులు, టిఎస్‌జిఎల్ఐ పెండింగ్ అమౌంట్లు, బకాయి పడ్డ పిఆర్‌సి అరియర్లు, డిఏ అరియర్లు ఇవ్వాలని సోమశేఖర్ కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమైఖ్య వాదులు వస్తున్నారు...జాగ్రత్త

**పాపన్నపేట, అక్టోబరు 3, ప్రభాతవార్త:** ఓట్ల కోసం నోట్లు పట్టుకుని సమైఖ్య వాదులు వస్తున్నారు, జర జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలకు జాగృతం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో ఐకెపి కేంద్రం వద్ద పనిముట్ల భవనం, బాచారంలో 48 రెండు పడకల గృహాల లబ్దిదారులకు ఇంట పత్రాలను పంపిణి చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్దిదారులకు పత్రాలు పంపిణి చేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగానే ఆరు హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, కోట్లాది రూపాయలు సంబంధించిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్‌కు సాధ్యం కాదని, అమలు కాని హామీలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇవ్వకున్నా అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తు చేశారు. అంతకు ముందు పాపన్నపేటలో రైతులకు అవసరమైన పరికరాలను అద్దెకిచ్చే కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మరో మారు తనకు అవకాశం కల్పిస్తే బాచారంలో ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తామని హామి చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలగౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, గడిలా శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గురుమూర్తిగౌడ్, లింగారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పాల్గొన్నారు.

## అన్నోజిగూడలో వినాయకుడి లడ్డూ ధర 2 లక్షల 35 వేలు

**-కాచవాని సింగారంలో లడ్డూ ధర 41 వేలు**

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ బంజారా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద వేలం పాటలో లడ్డూ ధర 2 లక్షల 35 వేల ధర పలికింది. 2 లక్షల 35 వేలకు ధరం సోత్ వికాస్ నాయక్ లడ్డూను కోనుగోలు చేసినట్లు తెలిపారు. ఇదే వినాయకుడి వద్ద 50 వేల రూపాయలకు పూలుపండ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. బంజారా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నానావత్ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన వేలం పాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఘట్‌కేసర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి పాల్గొని గణేశుడ్ని దర్శించుకుని పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుగులోత్ శ్యామ్, ప్రధాన కార్యదర్శి నానావత్ రాజ్‌గోపాల్, కోశాధికారి మాదిరెడ్డి విష్ణువర్దన్ రెడ్డి, నానావత్ రిషీ కిరణ్, సభ్యులు ఉపేందర్, గోవింద్ నాయక్, రాహుల్ నాయక్, విజయ్ సింగ్, విస్లావత్ వేణు తదితరులు పాల్గొన్నారు.

**కాచవాని సింగారంలో...**

ఘట్‌కేసర్ మండలంలోని కాచవాని సింగారంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో వార్డు సభ్యుడు రాజగోని మహేశ్ కుమార్ 41 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్న లడ్డూను మంద రాజు 21 వేల రూపాయలకు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు పెరుమాళ్ల సుదర్శన్, అంబ ేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చంచు నవీన్, నాయకులు నాగులపల్లి శ్రీనివాస్, ఎన్. నవీన్, పెరుమాళ్ల నరేశ్, యువజన సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## 15 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎస్టీయూటీఎస్

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** ఎంతో కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్లు ఎదురుచూస్తున్న పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమని, కానీ మధ్యంతర భృతిని కేవలం 50 శాతం ప్రకటించడం శోచనీయం అని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రణీద్ కుమార్, రాజగోపాల్‌గౌడ్ లు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ వేతన జీవులు కనీసం 10 నుండి 15 శాతం ప్రకటిస్తారని ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి 5 శాతం ఐఈఆర్ ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో వేతన జీవులు తీవ్ర నిరాశకు లోనయ్యారన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి 15 శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client **Mrs. Pamula Sri Latha,** W/o. Balakrishna Deema and D/o. Pamula Chandraiah, R/o. 2-13, Ghansiniyaguda, Shamshabad, R.R. District is intending to purchase the Plot No.28, admeasuring 184.78 Sq.Yards or 154.50 Sq.Mtrs, in Sy.No. 290, Situated in the Residential Lay out under the name and style of "SRI BALAJI COUNTY-1" of Mansanpally, Revenue village and Grampanchayat, Maheshwaram Mandal, R.R. District and bounded by: North : 70-0' Wide Road, South: Plot. No. 26, East: Sy. No.291 & Neighbour's land, West: Plot No.27, from its lawful owners and possessors, 1. Mr. Kandhi Suresh, S/o. Kandhi Buchappa, 2. Mr. Kandhi Shekar, S/o. S/o. Kandhi Buchappa, 3. Kandhi Ramesh, S/o. Kandhi Buchappa, 4. Kandhi Raju, S/o. S/o. Kandhi Buchappa, 5. Malleboina Uday Bhasker, S/o. Malleboina Narasimha and M/s. DHATHRISREE TOWNSHIP, Rep, by its Managing Partners, Mr. Eesari Naveen Kumar and Ms. Madhu Harisha. My Client has paid advance sale consideration amount to the aforesaid Vendors and entered into Allotment agreement dt. 30.09.2023.

If any person or persons, any Banks or any Financialinstitutions have any sort of objection or claims/right in respect of the above said property and its respective boundaries or its transaction title, interest or estate whatsoever against or in respect of the said land or any part thereof by way of inheritance, mortgage, possession, sale, share, gift, exchange, lease, grant/devise, Contract, Hen, Charge, trust, maintenance/ easement, transfer, license, bequest or otherwise or any or any other right or interest whatsoever, are hereby required to give notice of the same in writing to the undersigned at their address H.No. 1-4-24, Road No.2, Amrutha Avenue, Bandlaguda Jagir, Gandipet Mandal, R.R. District, Hyderabad-500 086, within 10 days from the date of publication hereof together with copies of all documents on the basis of which such claims are made failing which, any such right, title interest or claim, if any, shall be deemed to have been waived for all intends and purposes and shall not be binding on my client and my client will proceed with the execution and the registration of the Sale Deed in respect of the said land.

**M. JAYA KUMAR**
**ADVOCATE**
Office at 1-4-24,Road No.2, Amrutha Avenue, BandlagudaJagir, Gandipet Mandal, R.R.District, Hyderabad-500 086.
**Mobile No. 9885754399, 6303724109**

# ఎమర్జెన్సీని తలపిస్తున్న జగన్ సర్కార్

**-చంద్రబాబును బేషరతుగా విడిచిపెట్టాలి**

**-టిడిపి రాష్ట్ర నాయకులు సిహెచ్ బాలముకుందం**





సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకులు సిహెచ్ బాలముకుందం

**కుల్కచర్ల అక్టోబర్ 03,ప్రభాతవార్త :**

ఆంధ్రాలో టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షుడు మాజి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కక్ష్య పూరితంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం అవినీతి జగన్ ప్రభుత్వ పరాకాష్టకు నిదర్శనమని టిడిపి రాష్ట్ర నాయకుడు బాలముకుందం మండల పార్టి అధ్యక్షుడు బొక్క వెంకటయ్య అన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టి కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆంధ్రాలో జగన్ సర్కార్ ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని మాజి సిఎంను ప్రజల మనిషి నారా చంద్రబాబును అరెస్టు చేయడం అవివేకమని అన్నారు.జగన్ సర్కారుకు మద్దతు పలికిన బిఆర్ఎస్ పార్టిపై ఆయన దుమ్మెత్తి పోశారు.ఆంధ్రాలో చంద్ర బాబు నాయుడు ఆరెస్టు అయితే తెలంగాణలో నిరసనలు ఎందుకని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఒక్కసారి బిఆర్ఎస్ పార్టి నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని బిఆర్ఎస్‌లో ఉన్న నాయకులు ఏ పార్టి నుండి రాజకీయం నేర్చుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అది బిఆర్ఎస్ పార్టి కాదని మాజి తెలుగుదేశం పార్టి అని ఎద్దేవా చేశారు.దివంగత ఎన్‌టి రామారావు కాళ్ల దగ్గర పడిన కుక్కలు నేడు తెలుగుదేశం పార్టిని విమర్శిస్తుండటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.పరిగి నియోజక వర్గంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని బిసి సబ్బండ వర్గాల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సారథ్యంలో కాసాని వీరేశ్ అఖండ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.కాసాని వీరేశ్ ముదిరాజ్‌ను కొందరు వ్యక్తులు ముదిరాజుల మనిషి అని తప్పుదోవ పట్టిస్తున్నారని బిసి లోని 96 కులాలకు ఆయన న్యాయం చేస్తున్నారని ప్రజలు అపోహలు వీడి సంపన్న వర్గాలకు వ్యతిరేకంగా పరిగిలో 70శాతం ఉన్న వివిద కులాలకు చెందిన బిసిలు బిసి సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని గెలిపించాలని వారు కోరారు.తెలంగాణ వ్యాప్తంగా పరిగి నియోజకవర్గంలో అధికంగా ఉన్న బిసి లకు బదులు కమీషన్లకు ఆశపడి బిఆర్ఎస్ 3శాతం ఉన్న వర్గాలకే సీట్లు కేటాయిస్తూ వస్తోందని చరిత్ర తిరగరాసే సత్తా బిసి వర్గాలకు ఉందని త్వరలోనే ప్రభుత్వానికి తెలియజేస్తామని అన్నారు.దీనికి ఉదాహరణగా కుల్కచర్లలో జరిగిన సర్వాయి పాపన్న విగ్రహవిష్కరణ,పరిగి నడిబొడ్డున సబ్బండ వర్గాల నాయకుడు బూస్వాములకు వ్యతిరేకంగా ఉన్నోడిని కొట్టి పేదవారికి పంచిన పండుగల సాయన్న విగ్రహవిష్కరణకు వచ్చిన బిసిలను చూసి ఇతర పార్టీలకు ముచ్చెమటలు పడుతున్నాయని ఇది బిసి వర్గాల విజయమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

## హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్



చాకలిధనిగుట్ట తండాలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సర్కిల్ ఇన్స్ పెక్టర్ సురేష్

**నందిగామ అక్టోబర్3,ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్స వానికి ఈనెల 5వ తేదిన చాకలిధనిగుట్ట తండాకు రానున్న మంత్రి కెటిఆర్ హెలీక్యాప్టర్ ల్యాండ్ కానున్న స్థలాన్ని మంగళవారం నందిగామ సర్కిల్ ఇన్స్ పెక్టర్ సురేష్ పరిశీలించారు. మంత్రి ల్యాండ్ కానున్న ప్రదేశం,పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కార్యక్రమం నిర్వహిస్తున్న ఇంచార్జ్ మిట్టు నాయక్,సర్పంచ్ జెట్టావత్ రాజు నాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్స వానికి సిద్ధమైన గ్రామపంచాయతీ భవనాన్ని,చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హాజరైయే రాజకీయ ప్రముఖుల,అధికారుల వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సిఐ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జెట్టావత్ రాందాసు నాయక్,జాంప,కిషన్ నాయక్,ముడావత్ తులసిరాం,గబ్రు నాయక్,విస్లావత్ గోపాల్,చందర్,జెట్టావత్ శ్రీను నాయక్,గణేష్ నాయక్,లింబ్యా నాయక్,జెట్టావత్ లక్ష్మణ్ నాయక్,మేగావత్ రవి కుమార్,బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోవు రవి కుమార్,విజయ్‌నాయక్, ఉన్నారు.

## ఆరోగ్య రథాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### -కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**శంషాబాద్ అక్టోబర్3,ప్రభాతవార్త :** తోకల ఆరోగ్య రసాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శంషాబాద్ మండలం పెద్దతుప్పర తోకల ఆరోగ్య రతన్ ద్వారా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ మండల బిజెపి అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుష్మాన్ భారత్ స్పూర్తితో పెద్దతుప్రా గ్రామంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన తోకల ఆరోగ్య రథాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆరోగ్య సమస్యలతో బాధపడకూడదని ఆరోగ్య రథాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చిటికెల వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ చారి ,మండల ప్రధాన కార్యదర్శి ఎన్.యాదయ్య,మాజీ ఎంపిటిసి యాదగిరి,రాజ్ కుమార్ గౌడ్,జిల్లా కార్యవర్గ సభ్యులు యాదయ్య,లింగప్ప,వార్డు సభ్యులు కృష్ణ,శివ,రవీందర్, శంకరయ్య,ప్రవీణ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఉప సర్పంచ్



బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 3,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలం చౌదరిగూడ గ్రామానికి చెందిన మాజి ఉప సర్పంచ్ ఖలీల్‌తో పాటు మరి కొంత మంది మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఖలీల్‌కు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆయా పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, సర్పంచ్ వెంకటస్వామి, వజ్రలింగం, ధామోదర్‌రెడ్డి, జబ్బార్, నారాయణ, ఇస్మాయిల్, చంద్రబబాబు, అక్రమ్, మోతిలాల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ



వాటర్ ప్లాంటు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న కుర్మయ్య

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 3,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్ తాండ రుక్కాలి తండాలలో మంగళవారం వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయడం కోసం బీజెపి మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమో సేవాలాల్ శుద్ద జలం కార్యక్రమం ద్వారా పాలమురు విష్ణువర్ధన్‌రెడ్డి 50తాండాలలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఇందులో బాగంగానే కాస్లాబాద్, రుక్కాలి తాండాలలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గబ్రునాయక్, లక్ష్మణ్‌నాయక్, గణేష్‌నాయక్, రూపెష్, శంకర్, ధశరథ్, లలిత, చందిబాయి, హిందుబాయి ఉన్నారు.

### జంగారెడ్డిపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తల సమావేశం



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

**తలకొండపల్లి అక్టోబర్3,ప్రభాతవార్త :** గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వ పథకాలు గ్రామ అభివృద్ధి దళిత బంధు,బిసి బంధు,గృహలక్ష్మి పథకాల గురించి కానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ కమిటీని దూరం పెట్టి సర్పంచ్ ,మండల కమిటీ, ఎమ్మెల్యే సొంత నిర్ణయం తీసుకుంటున్నారని పలువురు బిఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆంజనేయులు గౌడ్,జైపాల్ రెడ్డి,వెంకట్ రెడ్డి,యాదయ్య గౌడ్,వనపర్తి శంకర్ సెట్,టి.రఘురాములు గౌడ్, ఎస్.తిరుపతయ్య,కుమార్ సెట్, వై.రామ్,వై.వెంకట్ రెడ్డి, రామ్ రెడ్డి,నరసింహా గౌడ్,జైపాల్ రెడ్డి,ధర్మారెడ్డి,పాల్గొన్నారు.

# గౌడ్‌ల సంక్షేమానికి బిఆర్ఎస్ పెద్దపీట : ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత ముఖ్యమంత్రి కేసిఆర్ గౌడసంఘం సంక్షేమానికి పెద్దపీట వేసారని గుర్తుచేశారు. మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు ఎల్గని అశోక్ గౌడ్ మరియు సంఘం నాయకులు, కల్లు లైసెన్స్ కలిగిన వారంత చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి సురంగల్ గ్రామంలో గౌడ సంఘం అభివృద్ధి కోరకు ఈతవనం మరియు గ్రామంలో గౌడ కుల అభివృద్ధి కార్యాకలాపాల కోసం గౌడ సంఘం భవనాన్ని కోరుతు వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. వెంటనే ఎమ్మెల్యే కాలే యాదయ్య వారి వినతిని విని కచ్చితంగా గౌడ్ సంఘ భవనం మరియు ఈతవనాలు ఏర్పాటుకు కృషిచేస్తానని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ వారి హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం పెద్దపీట వేసారని గుర్తుచేశారు, ముఖ్యమంత్రి చోరవతో రాష్ట్రంలో ఎన్నో వేల ఎకరాల్లో ఈతవణాన్ని అభివృద్ధి చేసారని, పట్టనాల్లో ఉన్న గౌడసంఘాలకు కుల్లు దుకాణాలను తిరిగి ప్రారంభించారన్నారు, తెలంగాణ గౌడకులాలు నాటి నుండి నేటి వరకు ఎంతో మంది గ్రామాల్లో కల్లుగేసి సేవచేసారని గుర్తుచేశారు. సురంగల్ గ్రామంలో కచ్చితంగా వారు కోరినట్లు, కుల సంఘ భవనం మరియు ఈతవనాన్ని ఏర్పాటుచేస్తామని హామి ఇచ్చారు, ఈ కార్యాక్రమంలో సురంగల్ గౌడ సంఘం అధ్యక్షులు ఎల్గని అశోక్ గౌడ్, ఉపాధ్యాక్షుడు చేగూరి మహేష్, కార్యాదర్శి కంధికోండ శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి చేగూరి విజేయ్ గౌడ్, సహయ కార్యాదర్శి ఎల్గని భూషన్ గౌడ్, లైసెన్స్ దారులు పాండు గౌడ్, నర్సింహా గౌడ్, లింగం గౌడ్, ఓంప్రకాష్ గౌడ్, వార్డు మెంబర్ కర్రోళ్ళ భాస్కర్, కార్యావర్గ సభ్యులు మద్దపూరం దేవేందర్ గౌడ్, ఎల్గని చిరంజీవి గౌడ్, ఎల్గని సాయిరాం గౌడ్, మెట్టు గారి భూను ప్రకాష్ గౌడ్, ఎల్గని ఎట్టయ్య గౌడ్, సంజీవ గౌడ్, మధుగౌడ్, రమేష్ గౌడ్,రాజుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, రవిందర్ గౌడ్, సమాయ గౌడ్, పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామాలు దేశానికి ఆదర్శం

### -రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ జాతీయ సలహాదారు హిమాన్ష్ మిశ్రా



పల్లె ప్రకృతి వనాన్ని సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహరెడ్డి కలిసి సందర్శించిన జాతీయ సలహాదారులు హిమాన్షు మిశ్రా

**కడ్తాల్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** తెలంగాణ గ్రామ పంచాయతీలు దేశవ్యాప్తంగా ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ జాతీయ సలహాదారు హిమాన్షు మిశ్రా అన్నారు. మంగళవారం కడ్తాల్ గ్రామ పంచాయతీలో డివిజన్ పంచాయతీ అధికారి అమృత, స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన రైతు వేదిక, పల్లె ప్రకృతివనం,వైకుంఠధామం, డంపింగ్ యార్డు, మహిళా స్వయం సహాయక సంఘాల వారి వ్యాపార సముదాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తీరు, పాఠశాల అభివృద్ధి, ఇంకుడు గుంతల నిర్వహణను పరిశీలించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి తోడ్పాటునందిస్తుందని సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం అభినందనీయమని కొనియాడారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గం పనితీరును ప్రశంసించారు. గ్రామ పంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వివరాలను సమగ్ర రూపకల్పనతో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిత్వ శాఖకు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల (ఎస్డిజి) చేదనలో గ్రామ పంచాయతీ పనితీరు ఆదర్శంగా ఉందని కితాబునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం తెలంగాణకు మణిహారంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులను సర్పంచ్ పనితీరును ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, వార్డు సభ్యులు బిక్షపతి, గణేష్‌గౌడ్, నాయకులు అశోక్, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, క్షేత్ర సహాయకుడు వెంకటేష్, మహిళా సంఘాల సభ్యులు సిసి వసంత, విఓలు వనిత శైలజ పాల్గొన్నారు.

# లఖింపూర్ ఘటనపై సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



సిఐటియు నాయకుల నిరసన కార్యక్రమ దృశ్యం

**యాచారం, అక్టోబర్ 3 ప్రభాతవార్త** లఖింపూర్ ఘటనను నిరసిస్తూ మంగళవారం యాచారం మండల కేంద్రంలో సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భ ంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్‌రెడ్డి, వ్యకాస జిల్లా అధ్యక్షుడు పి. అంజయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి. బ్రహ్మయ్యలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021లో వ్యవసాయ, కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీలకు అప్పచెప్పడాన్ని అదే విధంగా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధంగా బడ్జెట్‌లో భారీగా నిధులు తగ్గించిన విషయాన్ని నిరసిస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున 11 నెలల పాటు నిరసన చేస్తున్న సందర్భంగా బిజెపి కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రా కుట్ర పన్ని మూడు వాహనాలు తెచ్చి ఒక వాహనాన్ని మంత్రి కుమారుడు ఆశిష్ నడిపి ముగ్గురు రైతులు, ఒక విలేకరి మృతికి కారకులయ్యారని విమర్శించారు. వెంటనే అజయ్‌మిశ్రాను మంత్రివర్గం నుండి తొలగించి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత 23 రోజుల నుండి అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మద్యాహ్న భోజన కార్మికులు తమను రెగ్యులర్ చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చందునాయక్, ధర్మన్నగూడ సర్పంచ్ భాషయ్య, వ్యకాస రాష్ట్ర నాయకులు పుష్ప, రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, ఐలయ్య, వ్యకాస మండల నాయకులు ఎం. రాములు, జంగయ్య, సురేష్, సత్తయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గడిగె గజేందర్‌గౌడ్

**షాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** అరు ్హలైన రైతులందరికి రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిలా ్ల అధ్యక్షులు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం షాబాద్‌లో రైతువేదికలో మండల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భ ంగా ఆయన మాట్లాడుతూ.... లక్ష రూపాయాలలోపు రుణమాఫీ చాలా మంది రైతులకు మెసెజ్‌లు వస్తున్నాయి కానీ రైతుల రుణమాఫీ కావడం లేదన్నారు. ఈసమస్యను అధికారులు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా రైతులు ఫామ్ అయిల్ తోటలు పెట్టుకోవాలని వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలంలో విద్యుత్ సమస్యలు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, చంద్రయ్యగౌడ్, రవీందర్‌గౌడ్, నర్సింలు, వీరేశం , చంద్రబాబు, గౌతం, సత్యం, పద్మనాభం, గౌరీశ్వర్, రాజు ఉన్నారు.

## అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి : సిఐటియు

**కందుకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** కందుకూరు మండలంలో కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మెళ వలన వ్యవస్త చిన్నాభిన్నమైంది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిద రకాలైన ప్రజారంజక పథకాలను ప్రజలకు చేరవేస్తున్న అంగన్‌వాడీలు, అశాలు, మద్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేయడం వలన అయా పథకాలు ప్రజలకు అందకుండా పోతున్నాయని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె మంగళవారం 8 వరోజులో బాగంగా కార్మికులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు నాయకత్వం వహిస్తున్న సిఐటియు మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ మాట్లాడుతు కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని వివిధ రూపాలలో తమ నిరసనను తెలియజేస్తున్నారని న్యాయభద్దమైన డిమాండ్లను ఇచ్చిన పాలకులు వారు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అదే విధంగా మద్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు రావని, పాత కాలంనాటి నిత్యావసర ధరలు ల్కెపెట్టి ఇస్తున్నారని ఇలా కార్మికుల శ్రమలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ నెలలో ప్రభుత్వ పాఠశాలలో ఉదయంపూట బ్రేక్ ఫాస్ట్ ( అల్పాహారం) అందిచడానికి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని తీసుకోబోతుంది. దానికి కార్మికులు ఉత్సాహం చూపుతున్నా పాలకుల నుండి కార్మికులకు సరైన బరోసా రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్డ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని ప్రజలకు అందకుండా పోతున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విదంగా చర్యలు చేపట్టాలని సిఐటియు మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు కలిసొచ్చే రాజకీయ పార్టీల మద్దతుతో కార్మికుల సమ్మెకు మద్దతుగా నిలుస్తామని ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని ఉద్రుతం చేస్తామని అయనహెచ్చరించారు.



డిమాండ్ల సాధన కోసం మూతులకు బట్టలు కట్టుకుని నిరసనలు తెలుపుతున్న కార్మికులు

## నేడు షాబాద్ మండలంలో మంత్రి మహేందర్‌రెడ్డి పర్యటన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్పీటీసీ

**షాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** నేడు షాబాద్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయాడానికి రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అంకుగూడ వద్ద ఏర్పాట్లును పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.... బుధవారం మధ్యాహ్నం 2గంటలకు మాచన్‌పల్లి నుండి పోతుగల్ వరకు రూ.6కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 3గంటలకు హైతాబాద్ గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామమైన అంకుగూడ గ్రామానికి రూ.1కోటి నిధులతో బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తానన్నారు. మంత్రితో పాటు జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు వస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ శ్రీనివాస్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా,సర్పంచ్ మల్లేష్, మాజీ సర్పంచ్ దర్శన్, ఉప సర్పంచ్ గోపాల్ తదితరులు ఉన్నారు.

## బతుకమ్మచీరెలు, క్రీడా-వ్యాయామ కిట్స్ పంపిణీ



ఘట్‌కేసర్‌లో బతుకమ్మచీరెలు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని మేడ్చల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్బంగా 11 గ్రామ పంచాయతీలకు మంత్రి చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. మైనారిటీ కార్పొరేషన్ నుంచి ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన 50 మంది మహిళలకు కుట్టుమిషన్లు మంజూరు కాగా లబ్దిదారులకు మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ వై.అరుణ , మున్సిపల్ చైర్‌పర్సన్ పావని యాదవ్, జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి బలరామరావు, ఎంపిఓ నంద కిషోర్, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, సర్పంచులు ఒరుగంటి వెంకటేశ్‌గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, నిరుడి గీతా శ్రీనివాస్, నల్లోళ్ల యాదగిరి, చిలుగూరి మంగమ్మ, ఎంపిటీసిలు నిరుడి రామారావు, బొడ్డు వినోద నాగార్జున్, ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్య, మాజీ సర్పంచులు బైరు రాములుగౌడ్, దేశం బాల్‌రాజ్‌గౌడ్, చిలుగూరి సాయిలు, కొమ్మిడి సత్యనారాయణరెడ్డి, ఉదారి వేణుగోపాల్, మాజీ ఎంపిటిసి మంకం రవి, సొసైటీ డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వార్డుసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం...ప్రగతి కోసం తెలంగాణ

### -డ్రైనేజీ పనులను ప్రారంభించిన జడ్పివైస్ చైర్మన్



నర్సప్పగూడలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్

**నందిగామ అక్టోబర్ 3,ప్రభాతవార్త :** ప్రజల కోసం ప్రగతి కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. మంగళవారం నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో సర్పంచ్ గోవిందు అశోక్ ఆధ్వర్యంలో ఎంపిపి నిధులు 4లక్షల యాభై వేల రూపాయలతో డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పివైస్ చైర్మన్ మాట్లాడుతూ....ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ప్రత్యేక కృషితో ప్రతి పల్లే - ఊరు వాడలు అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. సిఎం కెసిఆర్ పాలనతో తెలంగాణలోని ప్రతి ఇంటికి సంక్షేమం ,ప్రతి ముఖంలో ఆనందం నిండుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రప్రజలందరూ సిఎం కెసిఆర్ నాయకత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. ఎల్లవేళలా అభివృద్ధిని కాంక్షించే ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను భారీ మోజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కళమ్మ ,ఉప సర్పంచ్ కాట్న శేఖర్,ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి ఎం.శివ శంకర్ గౌడ్,చెగూరు సింగిల్ విండో చైర్మన్ జి.అశోక్,బిఆర్ఎస్ నాయకులు బంటారం సుదర్శన్ గౌడ్,తదితరులు ఉన్నారు.

## మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



జడ్పీ చైర్మన్ అనితారెడ్డి నుంచి అభివృద్ధి పనుల కోసం 25 లక్షల ప్రొసీడింగ్‌ను అందుకుంటున్న జడ్పీటిసి దశరథ్ నాయక్

**కడ్తాల్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** మండల అభివృద్ధికి కృషి చేస్తానని, అభివృద్ధి విషయంలో కట్టుబడి ఉన్నానని జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా జడ్పీ కార్యాలయంలో కడ్తాల్ మండల అభివృద్ధి పనులకు సంబంధించి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్ల గురించి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి చేతుల మీదుగా రూ. 25 లక్షల ప్రొసీడింగ్‌ను అందుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి గ్రామానికి సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. మండల అభివృద్ధి గురించి నిరంతరం కృషి చేస్తానని అదేవిధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ సహకారంతో మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా కృషి చేస్తానని వారన్నారు.

### మున్సిపల్ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మున్సిపల్ భవనం ప్రారంభం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**కొత్తూర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలిక కేంద్రంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించడానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 5న రానున్న సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొత్తూర్ పురపాలక చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం షాద్‌నగర్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరేందర్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, పెంటనోళ్ల యాదగిరి, జనార్ధన్‌చారి, బ్యాగరి యాదయ్య, కె.రాజు, బండి కృష్ణ ఉన్నారు.

## ఎల్‌వోసి చెక్కు అందజేత

**యాచారం, అక్టోబర్ 3 ప్రభాతవార్త** యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన పెరుమాళ్ల నర్సమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో హాస్పిటల్ ఖర్చులకు గాను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో మంగళవారం రూ. 45 వేలు ఎల్‌వోసిని ఇప్పించినట్లు టిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బి. మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండు, సంజీవ, మద్దెల శశికళ, యశోద, వెంకటమ్మ, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్వరలోనే మాలల ఆత్మగౌరవ సభ

### -మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు

**యాచారం, అక్టోబర్ 3 ప్రభాతవార్త** మాల మహానాడు భవిష్యత్ కార్యాచరణ, 119 నియోజకవర్గాల్లో విస్తృత స్థాయి సమావేశాలు, రాజ్యాంగ పరిరక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, కమ్మ, కాపు, రెడ్డి, రెడ్డి, ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు గుండాలు పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో రాణించినటువంటి ప్రభుత్వాలకే తమ మద్దతు ఉంటుందన్నారు. రాజకీయ రిజర్వేషన్లలో తమ కోటా తమకే కేటాయించాలని, దళితబంధులో మా వాటా మాకివ్వాలని, గృహలక్ష్మి పథకాన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేని వారందరికీ పంచాలని, ప్రతి నియోజకవర్గానికి ఎకరం భూమి అంబేద్కర్ భవనానికి కేటాయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు ఉచిత విద్యనందించాలని, నిరుద్యోగ యువతకు భృతి ప్రకటించాలని, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మాజీ ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వాలని, గత 27 సంవత్సరాల నుండి దళితులను వర్గీకరణ పేరుతో విభజించి పాలిస్తున్నటువంటి అంశం తేల్చేయాలన్నారు.

### షాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**షాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని షాబాద్ మండల కేంద్రంలో ముస్లింలు సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. షాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పహిల్వాన్ షా దర్గా వద్ద మత పెద్దలు ప్రార్ధనలు చేశారు. ఈకార్యక్రమంలో మత పెద్దలు మౌలానా, మోహిద్దిన్ ఖాద్రీ, నేమతుల్లాఖాద్రీ, మసూద్,ఖాజ, మఖ్దుమ్, ముర్తుజా, మతీన్, అయూబ్, ఇమ్రాన్, ఇబ్రహీం, గౌస్, షమీమ్, ఇమ్రాన్, అజ్జు, మాజీద్, మునీర్, రుక్కు తదితరులు ఉన్నారు.



షాబాద్‌లో మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రాస్‌గా సిడి తండా గ్రామపంచాయతీ

**-సంక్షేమ బాటలో అడుగులు వేస్తున్న సర్పంచ్ రాజు నాయక్**
**-మంత్రి కెటిఆర్ ప్రారంభించనున్న గ్రామపంచాయతీ భవనం**


ప్రారంభానికి సిద్ధమైన సిడి తండా నూతన గ్రామపంచాయతీ భవనం


సిడి తండా వైకుంఠదామం ముఖద్వారం

**నందిగామ అక్టోబర్ 3,ప్రభాతవార్త :**
ప్రజల కోసం...ప్రగతి కోసం సీడి తాండ సర్పంచ్ జెట్టావత్ రాజు నాయక్ పట్టువీడని విక్రమార్కుడిలా పేరు తెచ్చుకొని సంక్షేమ బాటలో అడుగులు వేస్తున్నారు.మా తండాలో మారాజ్యం..ఎన్నో ఎళ్ల నాటి గిరిజనుల కళలను సాకారం చేసిన సిఎం కెసిఆర్‌ను దేవుడిలా కొలుస్తూనే ఎల్లవేలల నియోజక వర్గం అభివృద్ధిని కాంక్షించే ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆశీస్సులతో అభివృద్ధి దిశగా సర్పంచ్ రాజు నాయక్ ముందుకు సాగుతున్నారు.

**గిరిజన గ్రామపంచాయతీ భవనం నిర్మాణంలో రికార్డు :**
షాద్‌నగర్ నియోజకవర్గంలోనే తోలి గిరిజన గ్రామపంచాయతీ భవనంను మంత్రి కెటిఆర్ ప్రారంభించడం చరిత్రలో సువర్ణాధ్యాయంగా సిడి తండా గ్రామ సర్పంచ్ రాజు నాయక్ నిలువబోతున్నారు.సిడి తండా గ్రామపంచాయతీలో తాటిగడ్డ తండా,ధన్‌సింగ్ తండా,వంపుతండా,అయ్యప్ప కాలనీలో కొంత భాగం ,నాట్కో క్వార్టర్స్ హమ్లేట్ గ్రామాలున్నాయి.ఈ పంచాయతీలో సుమారు 12 వందలపై చిలుకు ఓటర్లున్నారు.8మంది వార్డు సభ్యులు ,ఎంపిటిసి పాలకవర్గంతో సర్పంచ్ తనదైన శైలిలో గిరిజన తండాల ప్రగతికి నాంది పలికారు.

**స్వర్గాన్ని తలపిస్తున్న వైకుంఠదామం :**
కొత్తగా ఏర్పడిన సిడి తండా పరిధిలోని అగ్రిగోల్‌నడ వెంచర్లో పదిశాతం భూమిలో డంపింగ్ యార్డు ,వైకుంఠదామం పచ్చని మొక్కల మధ్య స్వర్ణదామాన్ని తలపిస్తుంది.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు,జానపద కళలు అద్దం పడుతూనే సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల వర్ణచిత్రాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.సుమారు 50కిపైగా పథకాల రూపకల్పన హైలెట్‌గా నిలిచాయి.హరితహారాన్ని తలపించే రకరకాల పూల మొక్కలు,పండ్ల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతాయి.

**అభివృద్ధి పనులతో పురోగతి దిశగా :**
గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని తండాలలో సిమెంట్ రోడ్డు,అండర్ డ్రైనేజీ పనులు,వీధి దీపాల ఏర్పాటు మంచినీటి బోరుబావుల త్రవక్కం బోరు మోటర్లు బిగింపు వంటివే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో సుమారు 64వేల పైచిలుకు మొక్కలు నాటి మండలం లోనే చరిత్రకెక్కారు.ఊరు బాగుంటే సమాజం,రాష్ట్రం,దేశం బాగుంటుందని నమ్మె సర్పంచ్ స్వయంగా గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పనిచేసిన సందర్భాలు కోక్కొలలు.తడి,పొడి చెత్త వేరు చేసి ట్రాక్టర్ ద్వారా తరలించడం వంటివే కాకుండా గుడులకు,బడుల అభివృద్ధికి ప్రాముఖ్యతనివ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో రాజు నాయక్ ముందువరుసలో ఉండి ప్రగతికి దిక్సూచిగా పేరు సంపాదించారు.

**కార్పొరేట్ కార్యాలయం తలదన్నేలా :**
44వ జాతీయ రహదారి నుండి జేపి దరానగ వేళ్లే రహదారి పక్కన నిర్మించిన ఈ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని చూసిన ప్రతి ఒక్కరూ కార్పొరేట్ స్థాయిల్లో ఉందంటున్నారు.భవనం ముందు కంపౌండ్ హాల్,ముందు పార్కింగ్ ,చుట్టు మొక్కలు చూపరులను కనువిందు చేస్తుంది.కొత్త గ్రామ పంచాయతీ భవనం తమకు సౌకర్యంగా ఉందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చారి,కారొబార్ జెట్టావత్ శ్రీను నాయక్,వార్డు సభ్యులు,పారిశుధ్య సిబ్బంది,ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ముందు మహానీయుల విగ్రహాలు హైలెట్‌గా నిలిచాయి.

**ఎమ్మెల్యే ఆశీస్సులతోనే అడుగులు :**
పల్లెల తండాల అభివృద్ధి కాంక్షించే ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆశీస్సులతో వార్డు సభ్యుల సహకారం,అధికారుల ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో ప్రగతికి బాటులు వేసినట్లు సర్పంచ్ రాజు నాయక్ పేర్కొన్నారు.ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అడిగిన వెంటనే నిధులు కేటాయించి అభివృద్ధికి మార్గదర్శకమైన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కోటి 50 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభం



**శంషాబాద్ అక్టోబర్3,ప్రభాతవార్త :**
శంషాబాద్ మండలంలోని పిల్లోని గూడ పాలమాకుల గ్రామాల్లో కోటి యాభై లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం ప్రారంభించారు.ఎస్సీ కమ్యూనిటీ హాలు,సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి,జడ్పిటిసి తన్విరాజు ముదిరాజ్ ,ఎంపిపి జయమ్మ శ్రీనివాస్,వైస్ ఎంపిపి నీలం మోహన్ నాయక్,డిసిఎంఎస్ మాజీ చైర్మన్ శ్రావణ్ కుమార్,ఎంపిటిసి ఇందిరా కృష్ణ గౌడ్,సరిత రవీందర్,మాజీ సర్పంచ్ పోరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,గుర్రంపల్లి శ్రీనివాస్ యాదవ్,పగడాల ఆంజనేయులు గౌడ్,పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పురష్కారం అందుకున్న రొంపల్లి సంతోష్


ఉత్తమ సేవా పురష్కారం అందుకుంటున్న రొంపల్లి సంతోష్

**తాండూరు, అక్టోబరు 3, ప్రభాతవార్త :**
వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సామాజిక సేవకుడు, యువనాయకుడు ఉత్తమ సేవాపురష్కారం అందుకున్నాడు. సిటీ కల్చరల్ సెంటర్ హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ ఆద్వర్యంలో అక్టోబరు 2 మహాత్మా గాంధీ జయంతి పురష్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో వివిధ సేవా కార్యక్రమాల్లో ప్రావీణ్యం కనబరిచిన వారికీ ఉత్తమ సేవా పురష్కారాలను అందజేశారు. ఇందులో భాగంగా తాండూరుకు చెందిన యువనాయకుడు రొంపల్లి సంతోష్‌కుమార్‌కు అవకాశం దర్కింది. లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం, వైశ్య ఫెడరేషన్ ఆద్వర్యంలో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పట్టణంలో వేసవిలో ఉచిత రాగి అంబలి, మజ్జిగ పంపిణీ తదితర సేవలను గుర్తించి సంతోష్‌కు ఉత్తమ డాక్టరేట్ సర్టిఫికేట్‌తో పాటు మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా రొంపల్లి సంతోష్ మీడియాతో మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేద కుటుంబాలకు, విద్యార్థులకు తమ వంతు సహాకారం అందించడంలో ఎంతో ఆనందముందని అన్నారు. ఇందులో భాగంగానే వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5శాతం ఐఆర్‌ను ఖండిస్తున్నాం

**-యూఎస్‌పిసి నాయకులు రాజశేఖర్, గోపాల్**

**బొంరాస్‌పేట్,అక్టోబర్3,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు పే రివిజన్ కమీషన్(పిఆర్‌సి) వేయాడాన్ని స్వాగతిస్తున్నట్లు యూఎస్‌పిసి బొంరాస్‌పేట్ మండల అధ్యక్షులు రాజశేఖర్,ప్రధానకార్యదర్శి గౌరారం గోపాల్ తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న 5శాతం ఐఆర్ నిర్ణయంను ఖండిస్తున్నమన్నారు .ప్రభుత్వం ఏకపక్షంగా ఐఆర్ నిర్ణయం చేయడం సరికాదని ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి 15'% ఐఆర్‌ను ఇవ్వాల్సి ఉండగా 5శాతం నిర్ణయం చేయడం సోచనీయమన్నారు.ప్రభుత్వం వెంటనే సంఘాలను చర్చలు పిలిచి వారితో చర్చజరిపి ప్రభుత్వం 15శాతం ఐఆర్ ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పిసి) తరపున డిమాండ్ చేస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

**తాండూరు, అక్టోబరు 3, ప్రభాతవార్త :**
తాండూరు పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఉచిత దంత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. మధుకర సేవాసమితి, శ్రీసాయి డెంటల్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల ఆద్వర్యంలో సంయుక్తంగా మంగళవారం పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఉచిత దంత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 470మంది విద్యార్థులు, అధ్యాపకులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎక్కువ వేడి, చల్లటి పదార్థాలు తీసుకోరాదని సూచించారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి రెండు పూటలా దంతాలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పంటి నొప్పి, తదితర దంత సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్, ప్రిన్సిపాల్ సోంనాథ్, మధుకర సేవా సమితి ప్రతినిధులు సుభాష్‌రెడ్డి, సతీష్‌కుమార్, పురుషోత్తం, బిచ్చయ్య పాల్గొన్నారు.

## దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యం

**కీసర, అక్టోబరు3,ప్రభాతవార్తః**
దమ్మాయిగూడ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ 1వ వార్డు నుండి 18వ వార్డులలో భూగర్బ మురికి కాలువల రిపేరుకు మున్సిపల్ సాదారణ నిధులు 10లక్షలు,హిందూ స్మశాన వాటికల అభివృద్ధి కొరకు 33 లక్షలు,1వ వార్డు నుండి 18వ వార్డులలో బిటి ప్యాచ్ వర్క్‌లకు పది లక్షలు,పిల్లల పార్కు అభివృద్ధి చేయుటకు 4 లక్షలు,బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువుల వద్ద ఏర్పాట్ల నిమిత్తం 7 లక్షల 43 వేల 500 రూపాయలతో అభివృద్ధి పనులకు తీర్మాణం చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి,కమీషనర్ రాజమల్లయ్య,కౌన్సిలర్లు నాగాయపల్లి సుజాత శ్రీనివాస్,కొత్త హేమలత శ్రీనివాస్‌గౌడ్, కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్,మాదిరెడ్డి పావనిరెడ్డి,సంపనబోలు స్వప్న హరిగౌడ్, గురువెల్లి వెంకటరమణ,పాండాల అనురాధ యదిగిరిగౌడ్,వసుపతి రమేష్‌గౌడ్, రామారం శ్రీహరిగౌడ్,కో ఆప్షన్ సభ్యులు వహిదాబేగం,వడియాల రజిని,షేక్ షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

## ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తాం

**-టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటరత్నం**


బార్వాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**కోట్‌పల్లి అక్టోబరు 3, ప్రభాతవార్త :**
ఉద్యోగ,ఉపాధ్యాయులను అతి తక్కువ ఐఆర్‌తో వంచించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదు ఐఆర్‌ను 20%నికీ పెంచాలి లేకుంటే వచ్చి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని వికారాబాద్ జిల్లా టీఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు సిఎచ్ వెంకట్‌రత్నం డిమాండ్ చేశారు. మంగళవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అతి తక్కువ ఐదు శాతం ఐఆర్‌ను ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయులను వంచించడం తగ్గదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి ఉద్యోగ ఉపాధ్యాయులను నిరంతరం మోసం చేస్తూ వంచిస్తూ, సమయానికి వేతనాలు చెల్లించక, గత రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు రావలసిన డిఎలు ఇవ్వకుండా ఆగమేఘాల మీద ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జర పకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షాన అతి తక్కువ ఐఆర్ ఐదు శాతం ప్రకటించడం ప్రభుత్వానికి తగదని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లో వెళ్లాలంటే ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐఆర్‌ను 20, శాతం పెంచాలని లేని సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు గోపాల్,రామచంద్రయ్య,రాజశేఖర్,అనిత,ఫరూక్, పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సేవలు అమోఘం

**- స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ విశాలశ్రవణ్‌రెడ్డి**


అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి

**షాద్‌నగర్, అక్టోంబర్ 3, (ప్రభాతవార్త) :**
అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలు అమోఘమని రంగారెడ్డి జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ విశాలశ్రవణ్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ... గర్భిణీ స్త్రీలకు,, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు విశేషమైన సేవలు అందిస్తున్నాయని, అందుకు సహకరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల కృషి అనిర్వచనీయమని ఆమె కొనియాడారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ,, దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రాల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ రంగారావు, డీడబ్ల్యూఓ పద్మజ, మంచాల జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి, జిల్లా సీడీపీఓ అధికారులు, స్త్రీ శిశు సంక్షేమ, దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను తీర్చాలి

**-నాన్నవాళ్ల కుమార్ యాదవ్**

**శంషాబాద్ అక్టోబర్3,ప్రభాతవార్త :**
తమ న్యాయమైన కోరికల కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిజెపి ఓబిసి సెల్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నాన్నవాళ్ల కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.గత కొన్ని రోజులుగా శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను మంగళవారం ఆయన పరామర్శించారు.అంగన్‌వాడీ టీచర్లు జీతాలు పెంచాలని చేస్తున్న నిరసన దీక్షకు కుమార్ యాదవ్ మద్దతు ప్రకటించారు.న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.వారి సమ్మెకు మద్దతు తెలిపిన ఆయన వారి చేతి ఖర్చులకు ఐదు వేల రూపాయలను వారికి చేయూతగా అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ టీచర్‌లకు వెంటనే జీతాలు పెంచి వారికి ఆదుకోవాలని కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.


శంషాబాద్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

# రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు

**- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**


పూడూరు మండలం ఎన్కెపల్లి ఆదర్శ పాఠశాలలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు

**పూడూరు. అక్టోబర్ 3, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర సమాచార,పౌరసంబంధాలు,గనులశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి ఆదర్శ పాఠశాలలో 67వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌ఆఫ్ ఇండియా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలలో గ్రామీణ ప్రాంతాలనుండే దేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని గుర్తుచేశారు.చదువుతోపాటు ఆటలపట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని సూచించారు.దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని వివరించారు.క్రీడారంగంలో అర్జున అవార్డులు పొందిన రవికాంత్‌రెడ్డి,సుహాసినిలు రంగారెడ్డి,వికారాబాద్ జిల్లాలకు చెందిన వారేనని గుర్తుచేశారు.ఆటల పోటీలలో ఓటమీ,గెలుపు సహజమని, ఓడినవారు నిరాశకు గురికాకూడదని,నేటి ఓటమి రేపటి గెలుపుకు నాందిగా భావించాలని వివరించారు.ఆటల్లో చురుకుగా పాల్గొనేవారికి శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాంగా ఉండే అవకాశం ఉందని వివరించారు.జిల్లాలోని 18 మండలాలకు చెందిన 24 టీంలలో అండర్ 14,17 సంవత్సరాల వయస్సుకు చెందిన 320మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో విశ్రాంత డిఎస్‌పి బంటు రాములు ఆదర్శపాఠశాల అభివృద్ధికి రూ.5వేలు ఆర్థికసాహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వనజా వేణుగోపాల్,ఎంపిటిసి సురేందర్,డిఈఓ రేణుకాదేవి,ఎంఈఓ హరిశ్చంద్ర,ప్రిన్సిపల్ శ్రీదేవి,మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు దేవనోనిగూడెం వెంకటయ్య,పలువురు ఉపాద్యాయులు, పీడీలు, పిఇటిలు,విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరికల దృశ్యం

**యాచారం, అక్టోబర్ 3 ప్రభాతవార్త**
యాచారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామం నుండి బిఆర్ఎస్, సీపీఎం, బిజెపి, టిడిపిలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం టిపిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు స్వచ్ఛంధంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు ఉండబోతున్నాయని తెలిపారు. అధికార పార్టీ నాయకులు దోచుకున్న డబ్బులతో ప్రజలను కొనుక్కోవాలనుకుంటే అది వాళ్ల అవివేకమన్నారు. పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రజలు ఇందిరమ్మ రాజ్యం కోరుకుంటున్నారని, సోనియా గాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంట్ పథకాలను చూసి బిఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్ల పరుగెడు తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలోనే వైద్య సదుపాయాలు భేష్

**-కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, చిత్రంలో వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, గంప వెంకటేశ్‌గుప్త, పొనుగోటి అర్జున్‌రావులు ఉన్నారు.

**ఆమనగల్లు, అక్టోబర్03, ప్రభాతవార్త:**
పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీఠ వేస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. వైద్య సేవలకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధ్యానతను కల్పిస్తూ అన్ని సదుపాయాలతో ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతం చేస్తున్నదని ఆయన కొనియాడారు. వైద్యరంగంలో తెలంగాణ రాష్ట్రంకు దేశంలోని ఏ రాష్ట్రం పోటీగా నిలవదని, స్వల్పకాలంలోనే రాష్ట్రం దేశానీకే ఆదర్శంగా నిలిచిందని ఆయన కొనియాడారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో మంగళవారం సంచార వైద్యశాలను వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితీ మండల కన్వీనర్ నిట్టనారాయణ, సర్పంచ్ కడారి మల్లమ్మయాదయ్య, తలకొండపల్లి ఎంపీపీ నిర్మళశ్రీశైలంగౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సమావేశంలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. భారీ వ్యయంతో నిర్మితమైన సంచార వైద్యశాలలో ఆధునిక వైద్యసేవలందిస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, మందులు లబ్ది పొందవచ్చన్నారు. పరీక్షలలో ధీర్ఘకాలిక వ్యాధులు వెలుగులోకి వచ్చినా వారికి ప్రభుత్వ తోడ్పాటునందించి వైద్యం అందించేలా కృషి చేస్తామని చెప్పారు. సంచార వైద్యశాలను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు తీసుకువచ్చి వైద్యసేవలందిస్తామని చెప్పారు. అలాగే బస్తీ, పట్టణ దవాఖానాల ఏర్పాటుతో పేద, మధ్య తరగతి ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకువచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తూనే ప్రైవేటు ఆసుపత్రులలో పొందే సేవలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన పదుల సంఖ్యలో యువకులు, పురుషులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ పత్యనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, సురమళ్ళ సుభాష్, కమటం వెంకటయ్య, రమేశ్‌నాయక్, రూపం వెంకట్‌రెడ్డి, వస్పుల రంజిత్, పూసలి భాస్కర్, జంతుక కిరణ్, కడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

**-సీపీఐ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్**


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్

**కొడంగల్,అక్టోబర్ 3ప్రభాతవార్త :** రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్ డిమాండ్ చేశారు.కిసాన్ మోర్చ,కార్మిక సంఘాలు,వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం కొడంగల్ ప్రాంతంలో సీపీఐ పార్టీ తెలంగాణా రైతు సంఘాల వ్యవసాయ కార్మిక సంఘాల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.లకింపూర్ కేరిలో ప్రదర్శనగా వెళ్తున్న రైతులపై వాహనంతో తొక్కించి అతి కిరాతకంగా హత్య చేసిన కేంద్రమంత్రి అంజన్‌కుమార్ మిశ్రా కుమారుడు అశీస్ మిశ్రాను కఠినంగా శిక్షించాలన్నారు.అలాగే రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని,పంట మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలన్నారు.లేబర్ కోడ్‌లను రద్దు చేసి కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలన్నారు.ఉపాధిహామీ పథకం 200 రోజులకు పెంచి రోజువారి కూలీ రూ.600 చెల్లించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న రుణమాఫీ పూర్తిస్థాయిలో త్వరితగతిన చేయాలని డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ.మైముద్,వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎండీ. రహీం,శ్యాంసుదర్,సర్పంచ్ వెంకటప్ప,సీపీఐ దుద్యాల్ కన్వీనర్ గౌరారం కావలి లక్ష్మణ్, కురువ యాదవ సంఘం అధ్యక్షులు మల్లప్ప,సాగారం తండా టూగూర్ నాయక్ పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి : సర్పంచ్


విజేతలకు భహుమతులు ప్రధానం చేస్తున్న సర్పంచ్, నిర్వాహకులు

**కందుకూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త:**
క్రీడలు విద్యార్థులకు మానసిఖ ధృడత్వానికి శారీర దారుడ్యానికి దోహదం చేస్తాయని చదువుతోపాటు క్రీడలలో రానిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని నేదునూరు సర్పంచ్ కె రామక్రిష్ణారెడ్డి అన్నారు.67 వ ఎస్‌జిఎఫ్ జిల్లాస్తాయి కోకో పోటీలు నేదునూరు ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగాయి. ఈ పోటీలకు జిల్లా పరిదిలోని 8 జోన్ల శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, షాద్‌నగర్, కడ్తాల్, ఇబ్రాహింపట్నం, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, మహేశ్వరం, జోన్లనుండి అండర్ 14, అండర్17 బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఈ కోకో పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం బహుమతులను ప్రదానోత్సవం చేశారు. ఈ సందర్బంగా ఆయన మట్లాడుతూ... మారుమూల ప్రాంతాలలో చదువుకునే విద్యార్థులలో ఎంతో క్రీడా నైపుణ్యం ఉంటుందన్నారు. ఆ నైపుణ్యాన్ని వెలికి తీయడానికిఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని స్పూర్తి దాయకంగా నిలుస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సురేష్, ఎంఇఒ మనోహర్, అర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నక్రిష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పిడి హన్మంత్‌రెడ్డి, శేఖర్, పిఇటిలు మల్లయ్య, బాబయ్య, ప్రిన్సిపల్ శ్రీదర్, అయా పాఠశాలల ఉపాద్యాయులు పాల్గొన్నారు.